క్లుప్తంగా

'చలో ఢిల్లీ' కరపత్రాల విడుదల



కల్వకుర్తి రూరల్: సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఫిబ్రవరి 6న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు సంబంధించిన పత్రాలను శనివారం కల్వకుర్తిలో విడుదల చేశారు. మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నాగేందర్ మాట్లాడారు. జర్నలిస్టులపై జరుగుతున్న వేధింపులు, దాడుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం కల్వకుర్తిలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, వెంకటయ్య, నాగేష్, రాజన్న, రాంచంద్రయ్య, కరుణాకర్, ఉపేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



కోడేరు: మండలంలోని పస్పులకి చెందిన సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో రూ.లక్ష ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చెన్నయ్య, పాస్టర్ ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎల్‌ఓసీ



తెలకపల్లి: ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి బాధితులకు ఎల్‌ఓసీ లెటర్ అందజేశారు. మండల పరిధిలోని గట్టునెల్లికుదురుకి చెందిన నాగులుకు రూ.2.50 లక్షలకు సంబంధించిన ఎల్‌ఓసీని అందజేశారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా.. మెరుగైన వైద్యం కోసం నీమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ఎల్‌ఓసీ లెటర్‌ను బాధితులకు అందజేశారు. గ్రంథాలయ చైర్మన్ హనుమంతురావు, ఎంపీపీ కొమ్ము మధు, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బాబుగౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

6.5లక్షల ఎల్‌ఓసీ..



ఊర్కొండ: మండలంలోని బొమ్మరాశిపల్లికి చెందిన మాస్టర్ తులసిదర్ వినికిడి సమస్యతో బాధపడుతున్న కారణంగా చికిత్స నిమిత్తం రూ.6.5 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శనివారం అందజేశారు.

ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ అయూబ్ రెండు రోజుల కిందట మృతిచెందాడు. శనివారం జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. సింగిల్‌విండో వైస్‌చైర్మన్ సంజీవ్‌కుమార్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, డివిజన్ అధ్యక్షుడు రవికుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చేయూత

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలకి చెందిన అల్లాజికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ఫౌండేషన్ సభ్యులు అల్లాజికి డబ్బులు అందజేశారు. నిజాముద్దీన్, యాదయ్య, జంగయ్యగౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా..

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరానికి చెందిన లక్ష్మీ, వెంకటస్వామికి సర్పంచ్ తిరుపాటి నాగరాజు రూ.17 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. కొంత కాలం కిందట పలు అనారోగ్య సమస్యలతో అయినటువంటి ఖర్చును పేదలకు సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా ప్రజలకు తిరిగి ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

వెల్దండ: మండల పరిధిలోని ఎంజీతండాలో రాత్లావత్ చప్లి అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం బాధిత కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఐక్యత ఫౌండేషన్ పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. రామ్‌నాయక్, శంకర్‌నాయక్, శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం దుడ్డు బాలయ్యపై అదే గ్రామానికి చెందిన సదంపల్లి తిరుపతయ్య దాడిచేసి గాయపర్చినట్లు శనివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. తన పొలంలో గొర్రెలను మేపుతుండగా పక్కనే ఉన్న తిర్పతయ్య పొలంలోకి కొన్ని గొర్రెలు దాటాయని దూషిస్తూ.. కర్రతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్‌ఐ తెలిపారు.

రహదారులు అస్తవ్యస్తం

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

కల్వకుర్తి రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు మేలు చేస్తాయని ప్రతి ప్రజాప్రతినిధి చెబుతుంటారు. రహదారి సౌకర్యం ఉంటే ఆ ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం చూస్తున్నాం. కల్వకుర్తి మండలంలోని తుర్కలపల్లి గేటు నుంచి తోటపల్లి వరకు ప్రధాన రహదారి దెబ్బతిని ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. పది కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకలకు సమస్యలు తలెత్తడంతో చాలా మంది ద్విచక్రవాహనదారులు దూరం ఎక్కువైనా సరే అని చుట్టూ తిరిగి ప్రయాణం చేస్తున్నారు. దీంతో దూరభారం, ప్రయాణభారం వారికి సమస్యగా మారింది.

మూడు మండలాల ముఖ్య రహదారి

తుర్కలపల్లి నుంచి తోటపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారి మూడు మండలాలకు ముఖ్య రహదారిగా ఉంది. కల్వకుర్తి, తాడూరు, ఊర్కొండ మండలాలకు వెళ్లాలంటే ఈ రోడ్డు దగ్గరి దారిగా ఉంటుంది. ప్రతి నిత్యం పదుల సంఖ్యలో కార్లు, వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు రహదారి వెంట వెళ్తుంటాయి. రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది.



రహదారి ఇలా..



గుంతలమయంగా తోటపల్లి రోడ్డు

అడుగుకో గుంత

తుర్కలపల్లి, వేపూరు, బెక్కెర, తోటపల్లి గ్రామాలను కలుపుతూ వేసిన తారు రోడ్డు అడుగుకో గుంతగా మారి ప్రయాణికులకు నరకం చూపిస్తుంది. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో ఆర్టీసీ అధికారులు వాహనాలను నిలిపి వేస్తున్నారు. బస్సులను నిలిపి వేస్తుండడంతో స్కూలుకు వెళ్లేందుకు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వాహనాల యాజమానులు రేట్లను రెట్టింపు చేయడంతో ప్రజలకు ప్రయాణం భారంగా మారింది. ఐదు సంవత్సరాలుగా రోడ్డు మరమ్మతు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై గుంతలు పూడ్చడంతో పాటు కొత్తగా రోడ్డు నిర్మాణం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆచారి పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా సైతం నిర్వహించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ప్రయాణానికి ఇబ్బందిగా మారి వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్డు మరమ్మతు చేపట్టాలి. కొత్త రోడ్డు వేసే వరకు రోడ్డుపై గుంతలు పూడ్చివేయాలి.

– అనిల్‌కుమార్ తోటపల్లి

నివేదిక సమర్పించాం..

తుర్కలపల్లి నుంచి తోటపల్లి వరకు 10 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే రోడ్డు నిర్మాణం చేపడుతాం.

– దుర్గా ప్రసాద్, డివిజనల్ ఇంజినీర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తాళ్ల నిరంజన్

నాగర్‌కర్నూల్ రూరల్: రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు 68 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు తాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో తమిళనాడు తరహాలో బీసీలకు స్థానిక ఎన్నికల్లో 68 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, మేశ లక్ష్మయ్య, నిరజంన్‌యాదవ్, కొట్రశ్రీను, ఏకాంత్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడూరు శివారులో షార్ట్ ఫిలిం



షార్ట్ ఫిలిం ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్న యువకులు

తాడూరు: మండల పరిసరాలపై శనివారం షార్ట్ ఫిలింను చిత్రీకరించారు. అంతకు ముందు బీజేపీ మండల ఇన్‌చార్జ్ కొడనాగేష్‌తో షార్ట్ ఫిలింను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే షార్ట్ ఫిలింలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాము, స్వామి, ఫిలిం మేకర్స్ యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాదిరి ఎన్నికలు



ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థులు

తెలకపల్లి: మండల పరిధిలోని కార్వంగ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల విధానం ప్రతి విద్యార్థి ఓటు హక్కును వినియోగించుకునే తీరుపై ప్రత్యక్షంగా విద్యార్థులు పాల్గొని ఓటు వేశారు. బోధన విధానంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. ఓటు ప్రత్యేకతపై వారికి వివరించారు. ప్రతి సంవత్సరం మాదిరి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఓటు ప్రధాన ఆయుధమని, దేశ, రాష్ట్ర రాజకీయాలు ఓటరు చేతిలోనే ఉంటుందని, ఓటర్లు మంచి నాయకుడికి ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్ర, దేశ భవిష్యత్ మారుతుందన్నారు. మంచి నాయకుడిని గెలిపిస్తే సుపరిపాలనా అందుతుందని, విద్యార్థులు ఇప్పటి నుంచే ఓటుపైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఆరుగరు పోటీ చేయగా.. హేమలతకు 175 ఓట్లు పోల్ కాగా.. 76 ఓట్లతో గొలుపొందింది. 38 ఓట్ల తేడాతో శ్రీవల్లి ద్వితీయ స్థానంలో నిలిచిందని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

కొల్లాపూర్: స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు వెల్లడించారు. సమావేశానికి మండల అధికారులతో పాటు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని సూచించారు.

లింగాలలో..

లింగాల: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లింగమ్మ, ఎంపీడీఓ గీతాంజలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొనసాగే సమావేశానికి గౌరవ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

స్వయం సేవక్ సంచాలకులకు సన్మానం



సంచాలకులకు సన్మానం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, పరిషత్ నాయకులు

మన్ననూర్: శ్రీశైలంలో నిర్వహిస్తున్న అఖిల భారత సంఘ్ పరివార్ రాష్ట్ర స్థాయి సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కేదరీనాథ్‌కు చెందిన స్వయం సేవక్ సంచాలకులు మహజన్, దీనదయాల్‌ను మన్ననూర్ ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంచాలకులు మాట్లాడారు. హిందూ ధర్మ సంరక్షణకు కంకణబద్ధులై ముఖ్యంగా యువకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సాయం చేసే గుణం కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో పాల్గొనేందుకు ఆర్‌ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెం నారాయణ, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణలకు జిల్లా నుంచి అవకాశం రావడటంపై స్థానిక నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. సన్మాన కార్యక్రమంలో శేఖర్, వెంకటేష్, శ్రీనివాసులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి బూత్ కమిటీల ఏర్పాటు



అచ్చంపేట రూరల్: అచ్చంపేట నియోజకవర్గంలో బీజేపీ బలోపేతం కోసం బూత్ కమిటీలను నిర్దీత సమయంలోగా పూర్తి చేయాలని నియోజకవర్గ పాలక్ అందెబాబన్న కోరారు. శనివారం అచ్చంపేటలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో 22 మందితో కూడిన బూత్ కమిటీని ఏర్పాటు చేసి, ఈ నెల 31లోగా అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మొక్తాల రేణయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, నరేందర్ రావు, రామకృష్ణారెడ్డి, నాగరాజు, శ్రీనునాయక్, మంగ్యానాయక్, బాలాజీ, జానకి పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓకు చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

కల్వకుర్తి: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఊరుకొండపేట ఆంజనేయస్వామి దేవాలయంలో అన్నదానానికి ఊరుకొండపేట ఆంజనేయస్వామి దేవాలయ మాజీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి దంపతులు శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి రాజశేఖర్‌రెడ్డి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నదానం మహాదానమన్నారు. ప్రతిఒక్కరూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సునితతో పాటు పలువురు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి దంపతులను సత్కరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



నాగర్‌కర్నూల్ క్రైం: పత్తి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడిన సంఘటన మున్సిపాలీ పరిధిలోని ఎండబెట్ల శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెల్కపల్లి మండలం కార్వంగకు చెందిన భగవంతు తన సొంత ట్రాక్టర్‌లో 30 క్వింటాళ్ల పత్తిని మిల్లుకు తీసుకెళ్తుండగా.. ప్రమాదవశాత్తు ఎండబెట్ల శివారులో బోల్తాపడింది. ప్రమాద సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది.

మూడోరోజు కంటివెలుగు శిబిరం

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మూడో రోజు కంటి వెలుగు శిబిరం కొనసాగింది. శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు అందించారు. శిబిరాన్ని వైద్యులు చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం కంటి చూపు తగ్గిన వారిని గుర్తించి వారి చూపును మెరుగుపరిచేందుకు రెండో విడత చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. శనివారం రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 179 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 89 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.



రఘుపతిపేటలో..

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

తాడూరు: త్వరలో నిర్వహించే 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు అన్నారు. శనివారం మండలంలోని బలాన్‌పల్లిలో ఆ పాఠశాల హెచ్‌ఎం గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఉన్న సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకొని ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్యాన్ని అధిగమించేలా కృషి చేయాలన్నారు. అనంతరం సర్పంచ్ అశోక్ 250 మంది పాఠశాల విద్యార్థులకు సొంత డబ్బులు వెచ్చించి టై, బెల్టులతో పాటు క్రీడా పరికరాలను అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, పాఠశాల ఉన్నతికి రూ.20 వేల విరాళం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రకాష్, శివకుమార్, సతీష్‌కుమార్, జ్యోతిరాణి, సుల్తాన్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న ఏడుకొండలు సీఐ, ఉపాధ్యాయ బృందం

ఘనంగా శివస్వాముల పూజలు

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లి జ్ఞానానందస్వామి ఆశ్రమంలో శివస్వాములు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శివమాల ధరించిన స్వాములు కాలినడకన మండలంలోని పాపగల్, శిర్సవాడ, గోవిందాయిపల్లి, అంతారం, మేడిపూర్ మీదుగా పాదయాత్ర చేస్తూ శ్రీశైలం బయలుదేరే క్రమంలో జ్ఞానానందస్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలినడక కొనసాగించారు. కార్యక్రమంలో స్వాములు యాదవరెడ్డి, భూపాలచారి, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ ఆవరణలో కాలినడకకు సిద్ధమైన స్వాములు

అభివృద్ధి ప్రణాళికపై అవగాహన సదస్సు

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీలో 2023–24 అభివృద్ధి ప్రణాళికల తయారీపై గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలకు పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా రీసోర్స్ పర్సన్ కోటేశ్వర్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలో అభివృద్ధి ప్రణాళికలతో పాటు మిషన్ అంత్యోదయలో వ్యక్తుల గుర్తింపు పనులను పూర్తిచేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ డివిజన్‌లోని ఎంపీడీఓలు నటరాజు, ఏఓఆర్డీ వెంకటయ్య, ఎంపీడీఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న జిల్లా రీసోర్స్ పర్సన్ కోటేశ్వర్‌రావు

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ హన్మంతు, ఎస్‌ఐ కృష్ణా ఓబుల్‌రెడ్డి

తాడూరు: బిజినేపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలంటూ మండల కేంద్రంలో శనివారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ రోహిణి, టీపీసీసీ సరిత ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాచరిక పాలన సాగిస్తున్నాడని, దళితులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వారిని అడుగడున అవమానాలకు గురి చేస్తున్నారన్నారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు భారీ జన సమీకరణ కోసమే తాము అర్థమయ్యే రీతిలో తెలియజేస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు బాలగౌడ్, మద్దెల చంటి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిరండి

పెంట్లవెల్లి: దళిత, గిరిజన ఆత్మగౌరవ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని, ఈ సభకు తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. కాంగ్రెస్ మండ అధ్యక్షుడు మదుగం నరసింహయాదవ్ తెలియజేశారు.

సభకు సంపూర్ణ మద్దతు

కందనూలు: నియోజకవర్గంలో 8 ఏళ్లుగా దళితులు, గిరిజనుల ఆత్మగౌరవం అడుగంటి పోయిందని వీబీఏ రాష్ట్ర కోఆర్డినేటర్ బండి విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బిజినేపల్లి మండల కేంద్రంలో నిర్వహించే దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

బిజినేపల్లి: దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు పోలీస్‌శాఖ నుంచి అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, ఆదివారం నిర్వహించబోయే సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ మోహన్‌కుమార్ తెలిపారు. సభ కోసం ఒక ఇన్‌స్పెక్టర్, అయిదుగురు ఎస్‌ఐలు, 50 కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సభ ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని, ఇప్పటికే సీఐ హన్మంతు, ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పెంట్లవెల్లి: మండల కేంద్రం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బాలసభలో భాగంగా శనివారం విద్యార్థులు వారి ప్రతిభ పాఠవాలను, వేషధారణ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బలరాంకృష్ణారావు మాట్లాడారు. ప్రతి నెల ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి కళాపోషణ, లలితకళలు, నాటికలు, పాఠాలు వంటి మొదలగు అంశాలను ఎలాంటి భయం లేకుండా ప్రదర్శించారన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో చక్కగా రాణించాలని సూచించారు.



పిట్టలదొర వేషధారణలో మాట్లాడుతున్న విద్యార్థులు

వ్యక్తికి తీవ్ర గాయాలు

బల్మూర్: మండలంలోని అనంతవరం సమీపంలో బల్మూర్– లింగాల ప్రధాన రహదారిపై శనివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అనంతవరానికి చెందిన గుడెలి వెంకటయ్య తన ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వస్తున్నాడు.. అచ్చంపేట వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని కల్వర్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో బాధితుడి కుడికాలు విరిగిపోయి, తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్సులో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.